# పుట్టుమచ్చ

మల్లాది వెంకట కృష్ణమూర్తి.

సాయంసమయాలు గడిపేందుకు చాలా తక్కువ వ్యాపకాలున్నాయి. పాయింట్‌కి పదిపైసలతో స్నేహితులతో సూ గదిలోనే పేకాట ఒక వ్యాపకం. ఇంగ్లీషు సినిమాలు ఆడస్నేహితులతో చూడటం ఒక వ్యాపకం. ఈ రెండూ కాకపోతే, కళాభవన్‌లోనో, మేక్స్‌ముల్లర్ భవన్‌లోనో, ఇంకా ఇతర చోట్ల ఆర్ట్ ఎగ్జిబిషన్స్‌కి వెళ్ళడం నా వ్యాపకాలలో ఆఖరిది.

చిత్రలేఖనం అంటే నాకు చిన్నప్పటి నుంచీ మంచి అభిలాష. నేను గీసే బొమ్మలు తక్కువే అయినా, ఇతరులవి విమర్శనాత్మకంగా చూసి ఆనందించడం ఎక్కువ. కథలు వ్రాయడం తెలికే గాని బొమ్మలు గీయడం కష్టం. అందుకే కథారచయితలు ఎక్కువ, చిత్రకారులు తక్కువ అనుకుంటాను.

చిత్రలేఖనం నిజమయిన గుడ్‌గిఫ్ట్. కథలు వ్రాయడంకన్నా, కథలు ప్రతీ ముగ్గురిలో ఒకరు కృషిచేస్తే వ్రాయచ్చు గాని, బొమ్మలు గీయలేరు ప్రతి ముగ్గురిలో ఒకరు.

శుక్రవారం సాయంత్రం అయిదున్నరకి స్కూటర్‌ని రవీంద్రభారతి ఆవరణలో పార్క్‌చేసి, పక్కనే వున్న కళాభవన్‌వైపు నడిచాను. ఆరోజు క్రొత్త ఎగ్జిబిషన్ మొదలు. మరో వారం రోజులదాకా ఆ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ప్రదర్శన మొదటిరోజు, ఆ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన బొమ్మలు గీసిన చిత్రకారుడు కూడా వస్తున్నాడని తెలిసి, కావాలని ఆరోజే వచ్చాను, అతన్ని కూడా కలిసి మాట్లాడచ్చని.

ఫణీంద్రబాబు అతని పేరు. బయట వున్న సైన్ బోర్డ్ మీద ఆ ప్రదర్శన తాలూకు వివరాలు వ్రాసివుండటం గమనించి, ఆగి చదివాను.

చిత్రకారుడి పేరు ఫణీంద్రబాబు. మొత్తం ముప్పైఏడు చిత్రాలు ప్రదర్శిస్తున్నాడు. భారతదేశంలోని పదమూడు ముఖ్యమయిన నగరాలలో ఒక్కో నగరంలో వారంచొప్పున ఆ ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆర్ట్స్' అనే జాతీయ సంస్థ ఆ ప్రదర్శనని ఏర్పాటుచేస్తోంది.

బోర్డ్‌మీద వివరాలను చదువుతూంటే, నన్ను చేత్తో ప్రక్కకు నెట్టి ఒకతనువచ్చి చదవసాగాడు. కొద్దిగా ఉత్సాహంగా, నన్నలా ప్రక్కకి తోసి నతన్ని పరిశీలించి చూసాను.

దాదాపు ముప్పై అయిదేళ్లుంటాయి. బ్రవున్ కలర్ సూట్‌లో వున్నాడు. ఎరుపు, నీలంచారల టైమీద చిన్న కోతిబొమ్మ కుట్టివుంది ఎంబ్రాయిడరీతో. కొద్దిగా నయినా శాంతం కనిపించదు ఆ ముఖంలో.

నేను అతన్నే గమనించడం గ్రహించి కాబోలు, నా వంకచూసి నవ్వి అన్నాడు, "ఐయామ్ సారీ."

నేనూ చిన్నగా నవ్వి తల వూపాను ఫర్వాలేదన్నట్లుగా. అతన్ని అంతకు మునుపు రెండు మూడుసార్లు ఎక్కడో చూసిన గుర్తు.

"మీరు ప్రతి ఆర్ట్ ఎగ్జిబిషన్‌కీ వస్తున్నారు" అన్నాడు అతను నాతో కాసేపాగి.

"అంటే మీరూ వస్తున్నారన్నమాట" అన్నాను నవ్వి.

"నెలక్రితం మేక్స్‌ముల్లర్ భవన్‌లో జర్మన్ ఆర్టిస్ట్స్ జోక్సుల ప్రదర్శనకి వచ్చారు కదా!"

"అవును."

"నా పేరు అశ్వత్థామ."

అతను అందించిన చేతిని అందుకుని కరచాలనంచేస్తూ నా పేరు, నేను పని చేసే చోటు చెప్పాను. చాలా గట్టిగా, కొద్దిగా మొరటుగా వుంది అతని చేతి పట్టు.

"నేను హైద్రాబాద్ రెఫ్రిజరేటర్స్ లిమిటెడ్‌లో సీనియర్ డిజైనర్‌ని" చెప్పాడు.

"మీరు బొమ్మలు గీస్తారా!" అడిగాను.

"చాలా గీసాను. నా భార్య కూడా చిన్నప్పుడే నేర్చుకుంది చిత్రలేఖనం. ఆఫీసులో క్రొత్త మోడల్స్‌కి డిజైన్స్ గీస్తాను. తీరికవేళల్లో ఇంటిదగ్గిర సరదాగా బొమ్మలు గీస్తుంటాను.

ఇద్దరం లోపలికి నడిచాము. మేడ మెట్లెక్కి పైకి వెళ్లాం, ప్రదర్శనశాలకి. ముప్పైఏడు బొమ్మలు గోడకి వరసగా అమర్చబడ్డాయి. ఒకొక్కటి చూస్తూ నడవసాగాం. అశ్వత్థామ ఒకొక్క బొమ్మదగ్గరా ఆగి, నాకన్నా ఇంకా పరిశీలనాత్మకంగా, వివరంగా వాటిని చూస్తూ నాకు చెప్తున్నాడు తన విమర్శలు.

"ఇది గొప్ప చిత్రం...అక్కడ గ్రీన్ షేడ్ చక్కగా వాడాడు ... మరింత మందంగా వేస్తే ఇంకా బాగా రాణించేది ఇక్కడ...రెండు పక్షులతో ఆ ఆకాశాన్ని నింపచ్చు, మరీ ఆకాశానికి అంత చోటు వదిలేయకుండా...ఇండిగో

కలర్‌లో ఈ బొమ్మంతా వేస్తే బ్రిలియంట్‌గా వుండేది, నల్లరంగు బదులు ...”

అశ్వద్ధామకి బొమ్మలగురించి నా కన్నా ఎక్కువ పరిజ్ఞానం వుందని నాకు ఆ బొమ్మదాకా వెళ్ళకుండానే తెలిసి పోయింది. నాకన్నా అనుభవం వున్న మంచి చిత్రకారుడని గ్రహించి ఆ సంగతే చెప్పాను.


చిరునవ్వు నవ్వాడు.

'ఫణి' అని సంతకం చేశాడు చిత్రకారుడు ప్రతి చిత్రంమీద. ఫణీంద్ర బాబు అద్వితీయంగా గీసాడాబొమ్మలు. ఊహాచిత్రాలు కావు అవేవీ. మోడల్స్-ప్రాణంవున్నవీ, లేనివీ-మోడల్స్ చూసి గీసిన చిత్రాలవి.

అద్భుతంగా వున్నాయి. కేన్‌వాస్ మీద అంతకంటె మంచిబొమ్మలు నేను ఎక్కడా చూడలేదు, అంతదాక. ఒకటి రెండు ప్రదర్శనలు మినహా. నేను ఎప్పటికయినా అంత బాగా గీయగలనా అనిపించింది. గీసిన సబ్జెక్టు గీయకుండా గీసాడు చిత్రకారుడు.

అన్నిటికన్నా నన్ను అమితంగా ఆకర్షించిన బొమ్మలు అయిదున్నాయి. ఆవిరి వదులుతున్న రైలింజన్ బొమ్మలు. బరువుతూచే యంత్రంమీద నుంచుని వున్న లావుపాటి స్త్రీ బొమ్మ. భగవద్గీత చదువుతున్న వృద్ధురాలి బొమ్మ. ఆ బొమ్మలో నెరిసిన వెంట్రుకలు చక్కగా గీసాడు. పాలు పితుకుతున్న పల్లెపడుచు బొమ్మ. దీంట్లో కూడా నురగతో కూడిన పాలధార చక్కగా చిత్రించాడు. సన్నంగా వున్న పదిహేడు సంవత్సరాల అమ్మాయి బొమ్మ.

ఆ ఆఖరిచిత్రం మాత్రం నన్ను కదిలించేసింది. నన్నేకాదు. అశ్వత్థామని కూడా. అకస్మాత్తుగా చూస్తే నిజంగా ఎవరయినా అమ్మాయి నగ్నంగా నిలబడి వుందా అన్న భ్రమ కలుగక మానదు.




ఆ బొమ్మవంక దీక్షగా చూసాను, కన్నార్పకుండా. బ్రహ్మచారిని కాబట్టి కాదు. పూర్తిగా నగ్నంగావున్నా, ఆ బొమ్మలో అసభ్యతకాని, అశ్లీలంకాని కనిపించక పోవడం ఫణీంద్రబాబు నైపుణ్యం ప్రదర్శిస్తోంది. ఆ అమ్మాయి మొహం ప్రక్కకి త్రిప్పి ఎటోచూస్తోంది. ఆ మొహం కూడా స్పష్టంగా కనిపించకుండా వుంది. చీకట్లో నిల్చునివున్న ఆ అమ్మాయి వంటిమీద, గడ్డంనుంచి క్రిందిభాగంమీద మాత్రమే వెలుగు పడుతోంది.

సన్నటి మెడ, సన్నటి నడుము. రెండు వక్షజాలకి కింద, సరిగ్గా పొట్ట మీద నయాపైస పరిమాణంలో వున్న పుట్టుమచ్చయినా పూర్తిగా నల్లగాలేదు. కొద్దిగా తేనెరంగుతో వుంది. కేన్‌వాస్ మొత్తం అయిదడుగులుంటుంది. ఆ చిత్రం చాలామందిని ఆకర్షిస్తోంది. దాని ముందే నిలబడి చూస్తూ తమలో తాము మాట్లాడుకుంటున్నారు గుసగుసలుగా.

“అద్భుతంగా చిత్రించాడు కదూ?” అడిగాను నేను అశ్వద్ధామని.

తల వూపాడు అవునన్నట్లుగా. అశ్వద్ధామ కళ్ళలో వింతకాంతి. మెచ్చుకుంటున్నట్లుగా, కళ్లు తిప్పకుండా చూస్తున్నాడు ఆ చిత్రంవంకే, తదేకంగా.

“నేను గీసిన అనేక చిత్రాల్లో ఇది నాకు అన్నిటికన్నా బాగా పేరుతెచ్చింది. ఓ ముప్పై అయిదేళ్ళ వ్యక్తి చెప్తున్నాడు చూస్తున్నవాళ్ళకి.

''మీ పేరు?'' అడిగారెవరో.

“ఫణీంద్రబాబు.”

“మీరేనా ఈ చిత్రాలన్నీ గీసింది?” మరెవరో అడిగారు ఆతృతగా.

“అవును.”

“మిమ్మల్ని చూడటానికి ఎంతో నోచుకున్నాను” అందరికన్నా ముందు అశ్వద్ధామ ఫణీంద్రబాబు చెయ్యి అందుకుని కరచాలనం చేస్తూ అన్నాడు సంతోషంగా.

ఫణీంద్రబాబు దగ్గరగా వచ్చాడు. బహుశ ఆర్టిస్టిక్ పొగడ్తలవల్లే గర్వం అబ్బుతుందేమోః

"ఆ రైలింజన్ బొమ్మ వేయడానికి మీకు ఎంతకాలం పట్టింది?" అడిగాడు అశ్వద్ధామ.

"నాలుగురోజులు" చెప్పాడు ఫణీంద్రబాబు.

"ఆవిరి బైటికివస్తున్నట్లుగా చక్కగా చిత్రించారు. కలర్స్ ఏ విధంగా కలిపి ఆ ఎఫెక్ట్ తీసుకొచ్చారు?'' మరో ప్రశ్న వేసాడు అశ్వద్ధామ.

అతను దాదాపు పావుగంటదాకా కలర్స్ మిక్సంగ్ గురించి చెప్పాడు ఆసక్తి కలిగించేలా. తర్వాత ఆ బొమ్మకి ఇన్స్పిరేషన్ గురించి చెప్పాడు.

"చిన్నప్పటినుంచీ నాకు రైళ్ళన్నా, ముఖ్యంగా రైలింజనన్నా ఇష్టం. చిన్నప్పుడు పిల్లలు చాలామంది కార్లు, రైళ్ళబొమ్మలే గీస్తుంటారు. పెద్దయ్యాక రైళ్ళమీద వున్న ఆ ఆకర్షణ పోతుం దనుకుంటాను. నేను కావాలనికోరి వేసిన చిత్రం అది."

"ఈ బొమ్మ?" అడిగాను ఆ నగ్న చిత్రాన్ని చూపిస్తూ. వెంటనే ఫణీంద్ర బాబు ముఖంలో చిన్న చిరునవ్వు తళుక్కుమంది.

కాస్సేపు ఆ బొమ్మవంక దీక్షగా, ఆరాధనగా, ప్రేమగా చూసాడు. ఫణీంద్రబాబు చూపుల్లో, కళ్లలో నాకు ఆ భావాలు స్పష్టంగా గోచరించాయి. నా ప్రశ్నకు సమాధానం చెప్పబోయే ముందు రెండు, మూడు నిముషాలదాకా ఆ బొమ్మవంకే చూస్తూండిపోయాడు.

"ప్రతి మనిషికి ఓ తీయటి అనుభవం వుంటుంది, జీవితంలో సాధారణంగా. కవి అయితే కవిత అల్లుతాడు. గాయకు డయితే రాగం కడతాడు. శిల్పి అయితే చెక్కుతాడు...చిత్రకారుడయితే బొమ్మ గీస్తాడు."

"మీ జీవితంలోని ఓ తియ్యటి అనుభవంలోంచి సృష్టించారా ఈ కళా ఖండాన్ని?" అడిగాను.

"అంటే ఈ బొమ్మని వూహా గానంతో కాకుండా సజీవంగా వున్న వాళ్లని చూసి వేసారా?"

"అవును." ఇంకా ఆ బొమ్మవంక చూస్తూనే అన్నాడు నాతో. అతని వేళ్లు అతిసున్నితంగా కదులుతున్నాయి ఆ బొమ్మ మీది వంపులమీద. పొడుగాటి వేళ్లు అవి. రంగులు కలిపి అందాలు సృష్టించే వేళ్ళవి.

"మీ భార్యా?" అడిగాడు అశ్వద్ధామ.

"దురదృష్టవశాత్తూ కాదు."

"మీ ప్రియురాలా?" అడిగాను నేను.

"కాదనుకుంటాను ... జీవితంలో తొలిసారిగా తన సర్వస్వాన్ని నాకు సమర్పించుకున్న ఓ అందమయిన..." ఆగిపోయాడు..."అందమయిన శిష్యు రాలు" పూర్తిచేసాడు.

''ఇప్పుడెక్కడుంది?" అడిగాను.

"ఏమో?" అన్నాడు నిట్టూర్చి.

"ఆ పుట్టుమచ్చ నిజంగా అక్కడ అలాగే వుందా?" అడిగాను.

"తేనెరంగులో వుందా మచ్చ. రంగులు ఎలా కలిపారు?" ఉత్సాహంగా అడిగాడు అశ్వద్ధామ.

మరో పదిహేను నిముషాలు ఫణీంద్ర బాబు చెప్పుకుపోయాడు, ఆ పుట్టు మచ్చని యధాతథంగా చిత్రించడానికి, ఆ రంగు ఆ షేడ్‌లో రావడానికి తను ఎంత అవస్థపడ్డాడో. చాలా శ్రద్ధగా విన్నాడు అశ్వద్ధామ.

"మరి మొహం స్పష్టంగా వేయలేదే?' అడిగాను నేను అతను చెప్పటం ఆపాక.

నవ్వి వూరుకున్నాడు.

"ఈ బొమ్మని అమ్ముతారా?" అకస్మాత్తుగా అడిగాడు అశ్వద్ధామ కాస్సేపాగి.

తల అడ్డంగా వూపాడు ఫణీంద్ర బాబు, చిరునవ్వు నవ్వుతూ.

"వెయ్యిరూపాయలదాకా ఇవ్వగలను ఈ అయిదు ఇంటు ఒకటిన్నర అడుగుల కేన్‌వాస్‌కి" దర్పంగా అన్నాడు అశ్వద్ధామ, టై సర్దుకుంటూ.

మళ్ళీ చిరునవ్వు నవ్వి అన్నాడు ఫణీంద్రబాబు.

"దీన్ని అమ్మమని చాలామంది కోరారు నన్ను. మీరు చెప్పిన ధరకు పదిరెట్లు ఇస్తామన్న వాళ్ళుకూడా వున్నారు. ఇది ఏ ఒక్కరికో చెందితే భరించలేను. ఇటీస్ మై మాస్టర్ పీస్. నా తదనంతరం ఏదయినా ఆర్ట్‌గేలరీకి కాని, మ్యూజియమ్‌కిగానీ డొనేట్ చేసేస్తాను. ఈ బొమ్మద్వారానయినా నేను గుర్తుండిపోతాను చాలామందికి."

అశ్వద్ధామ మౌనంగా ఆ బొమ్మ వంకే చూస్తూనిల్చుండిపోయాడు. వెంటనే మరోసారి ఫణీంద్రబాబుతో కరచాలనం చేస్తూ అన్నాడు.

"ఐ కంగ్రాట్యులేట్ యు మిష్టర్. ఇటీజ్ మోర్ దేన్ ఏ మాస్టర్‌పీస్. ఇటీజ్ రియల్ ఆర్ట్."

"థాంక్ యు" అన్నాడు ఫణీంద్ర బాబు.

"మీతో కోకోకోలా తాగాలని వుంది. దయచేసి అయిదునిముషాలు స్పేర్ చేయగలరా?" అశ్వద్ధామ ఫణీంద్ర బాబుని అర్థించాడు.

వెంటనే అంగీకరించాడు ఫణీంద్ర బాబు. ముగ్గురం రవీంద్రభారతిలోవున్న కేంటీన్ చేరుకున్నాం. కోకోకోలా సిప్ చేస్తూండగా అడిగాడు అశ్వద్ధామ మళ్ళీ.

"ధర ఎక్కువ ఇస్తే ఆ చిత్రం ఇవ్వగలరా?"

"ఐయామ్ సారీ" అన్నాడతను.

"అశ్వద్ధామ తనని తాను పరిచయం చేసుకుని, నన్ను పరిచయం చేసాడప్పుడు ఫణీంద్రబాబుకి. అందంగా, ఆరోగ్యంగా

ఉన్నాడు తెల్లటి లాల్చీ. పైజామాలలో, అరంగుళం మందంగా పెరిగిన గడ్డంతో ఫణీంద్రబాబు.

"మైసూర్ లో ఆర్ట్ గేలరీ చూసారా ఎప్పుడయినా?" అడిగాడు ఫణీంద్రబాబు మమ్మల్నిద్దరినీ.

తల అడ్డంగా వూపాము ఇద్దరం.

"మీరు తప్పక చూడాల్సిన చిత్రాలు అందులో రవివర్మ చిత్రాలు డజను పైనే వున్నాయి. వాటికి ముందు గదిలోనే ఓ చిత్రం వుంది. అది రవివర్మ చిత్రాలన్నిటికన్నా గొప్పగా వుంది. అది మీరిద్దరూ తప్పక చూడాల్సిన చిత్రం."

అని ఆగి కోకోకోలా రెండు గ్రుక్కలు త్రాగి మళ్ళీ మొదలుపెట్టాడు.

''దాని పేరు 'గ్లో ఆఫ్ హోప్' ఓ ముప్ఫై ఏళ్ళ వనిత ఓ చేత్తో కొవ్వొత్తి పట్టుకుని, మరో చేయి ఆ కొవ్వొత్తి ఆరిపోకుండా అడ్డుపెట్టి నిల్చుని వుంటుంది. మొత్తం బొమ్మంతా ఇంతే.

"హఠాత్తుగా ఎవరయినా చూస్తే ఓ వనిత నిజంగా చేతిలో కొవ్వొత్తితో నిల్చునివుందన్న భావన కలుగుతుంది. ఆ బొమ్మలో అంత జీవం వుంది. ఆ కొవ్వొత్తి దీపానికి అంత వెలుగువుంది. ఏ కుంచెలు, ఏ రంగులు ఆ చిత్రకారుడు వాడాడోకాని, 'గ్లో ఆఫ్ హోప్' అన్న ఆ బొమ్మ, జీవకళతో వుట్టిపడేలా అంత సహజంగా వేసాడు."

చాలాసేపు చేతిలోని బాటిల్‌లోని కోకోకోలావంక చూస్తూండిపోయాడు ఫణీంద్రబాబు. బహుశ ఆ బొమ్మని గుర్తుతెచ్చుకుంటున్నాడు అనుకున్నాను. ఆకస్మాత్తుగా మిగిలివున్న కాస్త ద్రవాన్ని తాగి, ఖాళీబాటిల్ పక్కన పెట్టి నడుస్తూ అన్నాడు.

"నేను వేసిన, మీరు మెచ్చిన ఆ బొమ్మకూడా అలా అందరి కళ్ళబడి, అందరూ మెచ్చుకోవాలని నా ఆకాంక్ష. అందుకే ఆ బొమ్మని అమ్మకుండా పధ్నాలుగేళ్లనుంచి జాగ్రత్తపరుస్తున్నాను."

"ఎక్కడ మీరు పనిచేసేది?" అడిగాడు అశ్వద్ధామ అతన్ని.

"బెంగుళూరులో 'సిల్వానియా ఎడ్వర్టైజింగ్'లో కమర్షియల్ ఆర్టిస్ట్‌ని"

"పధ్నాలుగేళ్ల క్రితం ఆ బొమ్మని బెంగుళూరులో వేసారా?"


"అవును. పధ్నాలుగేళ్ళ క్రితం బెంగుళూరులో కాదు. రెండువందల మైళ్ల దూరంలో వున్న ఓ పల్లెటూరిలో."

ఆ బొమ్మ తనకి ఎంతగా నచ్చిందో చెప్తున్నాడు అశ్వద్ధామ. నేను వాళ్ళిద్దరి దగ్గరా శెలవుతీసుకుని స్కూటర్ వైపు నడిచాను.

* * *

ఆ తర్వాత మూడురోజులు గడిచాయి. మంగళవారం ఆ రోజు. పోలీస్





హాస్పిటల్లో రోజూ పని వుండదు. పోస్ట్ మార్టమ్ చేయటం నా డ్యూటీ.

మరణం సహజం కాకపోతే, అంటే ఆత్మహత్యో, లేదా హత్యో, లేదా ఏక్సిడెంటల్ డెత్ అయితేనో శవాలని మార్చురీకి తరలిస్తారు పోలీసులు శవపరీక్ష కోసం. ఇది ఓ ఆనవాయితీ.


ఒకటి రెండురోజులకోసారి రోడ్ ఏక్సిడెంట్‌లో మరణించినవారి మృత దేహం ఒకటయినా మార్చురీకి వస్తూం టుంది. కాని హత్యలు, ఆత్మహత్యల కేసులు విరివిగా రావు. తక్కువ. ఎప్పుడయినా వస్తేమాత్రం జాగ్రత్తగా వుంటాను ఆటోప్స్ చేసేటప్పుడు.

ఆ రోజు ఓ శవం సిద్ధంగా వుంది కోల్డ్‌రూంలో, నేను మార్చురీకి చేరుకునే సమయానికి.

'సస్పెక్టెడ్ సూసైడ్' అని వ్రాసి వుంది.

పావుగంట తర్వాత శవాన్ని టేబిల్ మీదకి చేర్చారు కోల్డ్‌రూంలోంచి. ఓ ముప్పైఏళ్ల యువతి. కుడికాలి బొటన వ్రేలికి కట్టివున్న టేగ్ మీద ఆ యువతి పేరు, షుమారు వయస్సు, చనిపోయిన సమయం, పోలీస్ డాక్టర్ ప్రైమరీ రిపోర్టులో వ్రాసిన మాటలు, 'సస్పెక్టెడ్ సూసైడ్—మేండ్రెక్స్' ... ఇంకా కొన్ని టెక్నికల్ వివరాలున్నాయి.

నా సహాయకుడు ఆ శవాన్ని వివస్త్రని చేసాడు. పరికరాలన్నీ సిద్ధం చేసాడు.




హఠాత్తుగా ఆగిపోయాను. భృకుటి ముడివేసి చూశాను. ఆ శవం పొట్టమీద, సరిగ్గా రెండు వక్షజాలక్రిందా ఓ పుట్టుమచ్చ! నయాపైసంత పరిమాణంలో తేనె రంగులో వున్న పుట్టుమచ్చ!!

నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. నా గుండె బరువెక్కింది. నాకు తెలియకుండానే విచారం కమ్మింది నన్ను. మూడురోజులక్రితం ఎంతో ఆరాధనగా ఎంతో దీక్షగా చూసిన కమ్మటి ఆ అందం ఇప్పుడు నిర్జీవంగా...

ఊహు. కాకపోవచ్చు. రెండూ ఒకటి కాకపోవచ్చు. మొహంవంక చూసాను. నేను బొమ్మలో అస్పష్టంగా చూసిన ఆ మొహం పోలికలు, రూపురేఖలు శవం మొహంలో వెదకడానికి ప్రయత్నించాను కాని నిర్ధారణచేసుకోలేకపోయాను!

పద్నాలుగు సంవత్సరాల క్రితం పదిహేడేళ్లన్న అమ్మాయి ఇప్పుడు...? మనసులో లెక్కవేసుకుంటే వయసు సరిపోతోంది.

గంటన్నర తర్వాత ముగించాను. మేండ్రెక్స్ టేబ్లెట్స్ ఇరవైదాకా తీసుకోవడంవల్ల సంభవించింది మరణం. బాగా మత్తు కలిగించే మేండ్రెక్స్ టేబ్లెట్స్ ఇరవైదాకా పొడిచేసి, పాలల్లో కలిపి పుచ్చుకోవడంవల్ల చచ్చిపోయింది. ఆ సంగతే రిపోర్ట్‌లో వ్రాసి సంతకం చేసాను.

ఆత్మహత్యకు తలపడేవాళ్ళు సాధారణంగా ఆ మాత్రలని మింగి మంచినీళ్లు తాగుతారు కాని ఓపికగా పొడిచేసి, పాలలోకలిపి మరీ త్రాగడం నా అనుభవంలో అరుదు.

ఆలోచిస్తూ బయటికి వచ్చాను, చేతులు శుభ్రంగా మోచేతులదాకా కడుక్కుని. బయట ఆదుర్దాగా కూర్చునివున్న ఆ చనిపోయిన యువతి భర్త నన్ను చూసి పులినిచూసి బెదిరినట్లుగా వులిక్కిపడ్డాడు, చిన్నగా కేక పెట్టి.

అతనెవరోకాదు.

అశ్వద్ధామ!

